క్లుప్తంగా

16, 17 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న ఏఐటీడీఎస్‌యూ ప్రత్యేక ఆహ్వానితురాలు హేమలత

బాడంగి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 16, 17వ తేదీల్లో పోస్టల్ ఉద్యోగులంతా సమ్మె చేయనున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏఐటీడీఎస్ యూనియన్ ప్రత్యేక ఆహ్వానితురాలు ఆర్.హేమలత బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఇంక్రిమెంట్లు, రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ ఉద్యోగులకు కల్పించాలని కోరారు.

సజావుగా క్యాంపస్ ఇంటర్వ్యూలు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లిలో భాస్కర ఫార్మసీ కాలేజీలో ఎస్ఆర్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చుట్టుపక్కల కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో వివిధ ఉద్యోగాలకు 30 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు స్వరూప్ సింగ్, వాత్సల్య తెలిపారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. హరిజన వీధి, ఆదర్శనగర్‌లోని మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయవద్దని, ఇంటింటికీ వస్తున్న క్లాప్ మిత్రలకు చెత్తను వేరు చేసి ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ ప్రజలను కోరారు.

ముగిసిన పైడితల్లి సంబరాలు



పైడితల్లి ఘటాలతో వెళ్తున్న భక్తులు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పైడితల్లి సంబరాలు బుధవారంతో ముగిశాయి. సోమవారం నుంచి ప్రారంభమైన పండగలో భాగంగా మంగళవారం అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించగా, బుధవారం ఘటాలు, పాలజంగిడికి భక్తులు పూజలు చేసి, అనుపోత్సవం చేశారు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలి



లచ్చయ్యపేటలో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు

రాజాం: సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు పట్టణ వాసులను కోరారు. బుధవారం మండలంలోని లచ్చయ్యపేటలో పన్ను వసూళ్లపై అవగాహన కల్పించి, పలువురి నుంచి పన్ను వసూలు చేశారు. సకాలంలో పన్ను చెల్లించడం ద్వారా పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో పలువురు పేదలకు బుధవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నాబాబు, దూపం వాసు, గేదెల జనార్దనరావు, మరడ స్వామినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయుల ఆరా



రామభద్రపురంలోని కల్లి వీధిలో విద్యార్థి చదువుపై తల్లిదండ్రులను ఆరాతీస్తున్న టీచర్లు

రామభద్రపురం: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ఆరాతీస్తున్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటి వద్ద కూడా విద్యార్థులు చదువుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. టీవీ, స్మార్ట్‌ఫోన్లకు వారిని దూరంగా ఉంచి, చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కూడా పాఠశాల నుంచి ఇంటికి చేరిన తర్వాత కూడా చదువుకునేందుకు ఆసక్తి చూపాలన్నారు.

హోలీ.. ఆనందాల కేళీ!

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో హోలీ సంబరాలు బుధవారం మిన్నంటాయి. ప్రతీచోట జరిగిన ఈ వేడుకల్లో యువతీయువకుల కేరింతలతో ఆనందాలు వెల్లివిరిశాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా ముఖానికి రంగులద్దుకుని, సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. వీధులు, రోడ్లు రకరకాల రంగులతో నిండిపోయాయి. దీంతో పల్లెలు, పట్టణాలు, నగరాల్లో పండగ వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురంలో చిన్నారుల హోలీ సంబరాలు



బాడంగిలో రంగులు పూసుకుంటున్న యువకులు



రేగిడి: వన్నలిలో వీధుల్లో రంగులు చల్లుకుంటున్న విద్యార్థులు



మెంటాడలో హోలీ సంబరాల్లో చిన్నారులు



తెర్లాంలో హోలీ వేడుకల్లో చిన్నారుల సందడి

ఏవైనా సమస్యలుంటే నాకు చెప్పండి



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, వారి సమస్యలపై చర్చించారు. ఏవైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు విన్నవించి, వాటిని పరిష్కరించాలని కోరగా, దానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీ మద్దతిస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

మెంటాడ: ఎల్లమ్మ జాతర పురస్కరించుకుని, మండలంలోని తమ్మిరాజుపేటలో బుధవారం మహిళలకు నిర్వహించిన రంగవల్లుల పోటీలు చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. వందలాది మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొని, రకరకాల ముగ్గులు(రంగవల్లులు) వేసి, తమలోని ప్రతిభ చాటుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరాములు వ్యవహరించగా, గురువారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



ఆలయ ఆవరణలో ముగ్గులు పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలు

14న పూజా సామగ్రి వేలం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 14వ తేదీన పూజా సామగ్రికి సంబంధించి, బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల నుంచి కొబ్బరిచిప్పలు వసూలు చేయడంతో పాటు పూజాసామగ్రి సెట్లు, పుస్తకాలు, రక్షా బంధనాలు, అమ్మవారి లామినేషన్ ఫొటోలు అమ్ముకునేందుకు ఈ వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ఒక్కో దానికి రూ.20 వేలు చొప్పున డిపాజిట్ చేయాలని, పాట దక్కించుకున్న వారికి ఈ నెల 30 నుంచి 2025 మార్చి 29వ తేదీ వరకు రెండేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఆలయం వద్దకు వచ్చి, సంప్రదించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.బుచ్చిరాజు తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి, ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో జాయిన్ అయ్యేందుకు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9704550009 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

వంగర: గ్రామాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ కె.వినయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన జీడితోటలు, పంటపొలాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు పలుచోట్ల గుర్తించామని, దీనివల్ల ప్రజలకు ప్రాణాపాయం ఉన్నందున వీటిని మానుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బొబ్బిలి, కలువరాయి, పిరిడి, గొల్లపల్లి, జగన్నాథపురం, బలిజిపేట ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ పూడి హరి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. మరమ్మతులు, మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కలిగే అంతరాయానికి చింతిస్తున్నామని, బాధిత ప్రాంతాల ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి



రాజాం: తెలగవీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. బుధవారం ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ మద్దతు అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను ఆయన గెలుపు ద్వారా చాటాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



రాజాం: అంతకాపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ చిన్నంనాయుడు



తెర్లాంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ ఉమాలక్ష్మి



బొబ్బిలి రూరల్: పారాదిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ శాంతకుమారి



బొబ్బిలి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రాజాం సిటీ: పెనుబాకలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు



రేగిడి: అంబఖండిలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: డోలాపౌర్ణమి పురస్కరించుకుని, స్థానిక గీతామండపం వద్ద వేణుగోపాలస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ క్రమంలో భక్తులు స్వామిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

వైభవంగా డోలాయాత్ర

తెర్లాం: డోలా పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో డోలా యాత్ర మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారి విగ్రహాలను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు.

మహిళలను గౌరవించాలి



రాజాం సిటీ: సెయింట్ ఆన్స్ స్త్రీశక్తి కేంద్రంలో మహిళలకు సత్కారం

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులంతా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మహిళలకు ముగ్గులు, క్రీడాపోటీలు నిర్వహించగా, మరికొన్నిచోట్ల మహిళా అధికారులు, ఉద్యోగులను సత్కరించి, వారి పట్ల ఉన్న గౌరవం చాటుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: మహిళా హక్కులను వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు



బొబ్బిలి/బొబ్బిలి రూరల్: న్యాయమూర్తి సౌమ్యకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు



బొబ్బిలి/బొబ్బిలి రూరల్: సీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం



రేగిడి: మహిళా పోలీస్‌కానిస్టేబుల్స్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు



బాడంగి: మహిళా పోస్టల్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్ఓ సురేష్ తదితరులు



రాజాం పట్టణంలో మహిళా దినోత్సవ ర్యాలీ



వంగర: మహిళా దినోత్సవం సందర్భంగా బాగెంపేటలో మహిళలకు ముగ్గుల పోటీలు



బొబ్బిలి రూరల్: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది



రాజాం: విజయవాడలో ఉత్తమ మహిళా అధికారిగా అవార్డు అందుకుంటున్న దుర్గమ్మ